ఐటెం –2

27.05.2020

అమరావతి

- సీఎం క్యాంప్ కార్యాలయంలో 'మన పాలన–మీ సూచన' కార్యక్రమం.
- మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా'విద్యా రంగం'పై మేధో మథనం.
- విద్యార్ధులు, నిపుణులు, అధికారులతో సీఎం శ్రీ వైయస్ జగన్ ముఖాముఖి:›
- పేదవిద్యార్థుల బాగుకోసం ఇంగ్లిష్ మీడియం
- అందుకు ఉక్కు సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం
- సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించాం
- చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో ఇలాంటి కార్యక్రమాన్నీ అడ్డుకుంటున్నారు
- ఇంగ్లిష్మీడియం తీసుకు వస్తే తెలుగును అవమానించినట్టేనని కొత్త థియరీ తీసుకు వస్తున్నారు
- మరి వాళ్ల పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారు..
- ముఖ్యమంత్రి శ్రీ వైయస్
- 94 శాతం పేరెంట్స్ కమిటీలు కూడా కోరుతున్నాయి
- 40 లక్షల తల్లిదండ్రులలో 96 శాతం వారిదీ అదే కోరిక
- ఉన్నత విద్యతోనే నిరుపేదల బతుకులు మారుతాయి
- అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియమ్పై నిర్ణయం: సీఎం

అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియమ్ తప్పనిసరి అని, అందుకు ఉక్కు సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ ప్రకటించారు. ఈ విషయంపై ఇప్పటికే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని ఆయన వెల్లడించారు. 94 శాతం పేరెంట్స్ కమిటీలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియమ్ కావాలని కోరుతున్నాయని, వ్యక్తిగత అభిప్రాయ సేకరణలో 40 లక్షల తల్లిదండ్రులలో 96 శాతం కూడా అదే కోరారని తెలిపారు. ఉన్నత విద్యతోనే నిరుపేదల బతుకులు మారుతాయన్న సీఎం, ఆ దిశలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియమ్‌పై నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

'మన పాలన—మీ సూచన' కార్యక్రమం మూడవ రోజున 'విద్యా రంగం'పై మేధో మథనం జరిగింది. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నిపుణులు, అధికారులతో సీఎం శ్రీ వైయస్ జగన్ ముఖాముఖిలో పాల్గొన్నారు.

మంత్రులు ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎస్ నీలం సాహ్నీ, విద్యా శాఖకు చెందిన అధికారులతో పాటు, నిపుణులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా .

## పేరెంట్స్ కమిటీలు కావాలన్నాయి:

పేద విద్యార్థులు, వారి కుటుంబాల బాగు కోసం చేపట్టిన చర్యలలో భాగంగా, ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియమ్‌గా మార్చాలని నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అందుకోసం పేరెంట్స్ కమిటీలు ఉండాలని, వాటికి బాధ్యతలు అప్పగించాలని చెప్పి, అన్ని స్కూళ్లలో ఎన్నికలు జరిపించి పేరెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించామని తెలిపారు.

'ఆ తర్వాత పేరెంట్స్ కమిటీలు ఏర్పడిన తర్వాత, వాటిని అడిగాం. మన పిల్లలకు తెలుగు కంపల్సరీ సబ్జెక్ట్ చేస్తూ, ఇంగ్లిష్ మీడియమ్ తీసుకురావడం మంచిదేనా అని చెప్పి.. అప్పుడు ఆశ్చర్యకరమైన సమాధానం వచ్చింది. దాదాపు 94 శాతం పేరెంట్స్ కమిటీలు దాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాయి. ప్రభుత్వ

పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియమ్ ఉంటేనే డబ్బులు కట్టకుండా తమ పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకుంటారని, బాగా చదువుకుంటారని, అప్పుడే తమ పిల్లలు భావి ప్రపంచంలో పోటీ పడగలుగుతారని 94 శాతం పేరెంట్స్ కమిటీలు తేల్చి చెప్పాయి' అని సీఎం వివరించారు.

## అడుగడుగునా అడ్డుకునే యత్నం:

పేదవారు అంత అత్యుత్సాహంగా తమ పిల్లల బతుకులు మార్చాలని ఆరాటపడుతున్నా కూడా.. మన ఖర్మ కొద్దీ ఒక చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మనం బతుకుతున్నామని సీఎం పేర్కొన్నారు.

అటువంటి కార్యక్రమానికి కూడా అడ్డంకులే అని, బయట ఒకటి మాట్లాడుతారని, మరోవైపు అసెంబ్లీలో బిల్లును అడ్డుకున్నారని గుర్తు చేశారు. అయితే బిల్లును డిలే చేయగలిగారు కానీ, అడ్డుకోలేకపోయారని చెప్పారు. ఆ బిల్లును మళ్లీ పెట్టామని, పాస్ చేయించామని తెలిపారు.

## కొత్త కొత్త థియరీలు:

'ప్రతి అడుగులో కూడా అడ్డుకోవడమే. అడ్డుకుంటూ అడ్డకుంటూ చివరకు వీరంతా ఎటువంటి మాటలు మాట్లాడతారంటే, ఇంగ్లిష్ మీడియమ్ అని తీ‌సుకువస్తే తెలుగును అగౌరవపర్చినట్లు అని చెప్పి కొత్త థియరీలు తీసుకువస్తారు. ఇవన్నీ కూడా ఆశ్చర్యం కలిగించే థియరీలు'.

'అంతగా తెలుగును గౌరవించాలనే ఈ పెద్దమనుషులు తమ పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లను ఎక్కడ చదివిస్తున్నారు అంటే అందరూ ఇంగ్లిష్ మీడియమ్‌లోనే చదివిస్తున్నారు. కానీ పేదవారు మాత్రం తెలుగు మీడియమ్‌లోనే చదవాలంట. తెలుగును గౌరవించాలంట. వాళ్లు మాత్రం ఇంగ్లిష్ మీడియమ్‌లో చదివొచ్చు.. తెలుగును గౌరవించినట్లు అట. ఇటువంటి ప్రసంగాలు ఇస్తా ఉంటారు' అని సీఎం అన్నారు.

**ఉక్కు సంకల్పంతో..**

వారు మళ్లీ కోర్టులకు వెళ్లడం, కోర్టుల నుంచి అడ్డంకులు తీసుకువచ్చే ప్రయత్నం చేశారని తెలిపారు. అయినా కూడా కచ్చితంగా ఇది చేయాలని, ఇది రావాలని, పేదవాడి జీవితంలో మార్పు తీసుకురావాలి అన్న ఉక్కు సంకల్పంతో అడుగులు ముందుకు వేశామని సీఎం శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు.

**తల్లిదండ్రులూ జై కొట్టారు:**

'తర్వాత కోర్టులలో అడ్డంకులు కలగజేస్తే, ఆ అడ్డంకులను కూడా స్ఫూర్తిగా తీసుకుని దాదాపుగా మొత్తం 40 లక్షల మంది తల్లిదండ్రుల దగ్గరకు వలంటీర్లు, విద్యా శాఖ సిబ్బందిని పంపించి, ఇంగ్లిష్ మీడియమ్ కావాలా? వద్దా? అని అభిప్రాయాలు సేకరించాం. ప్రతి ఇంటికి మనిషిని పంపాం. అందులో వచ్చిన ఫలితం ఏమంటే.. గవర్నమెంటు స్కూల్‌లో తెలుగు కంపల్సరీ సబ్జెక్టు చేస్తూ, ఇంగ్లిష్ మీడియమ్ ప్రవేశపెట్టాలన్న దానిపై పేరెంట్ కమిటీల్లో 94 శాతం సమర్థిస్తే, వ్యక్తిగతంగా ఇళ్ల నుంచి తీసుకున్న అభిప్రాయంలో 96 శాతం గట్టిగా సమర్థించారు'.

'ఆ 96 శాతం వారి అభిప్రాయాలను రాష్ట్ర స్థాయి సలహా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ)కి పంపించాం. వాళ్ల సిఫార్సులు కూడా వచ్చాయి. మండలానికి ఒక తెలుగు మీడియమ్ స్కూల్ పెట్టండి. మిగతావన్నీ ఇంగ్లిష్ మీడియమ్‌లోకి మార్చమని సూచించింది. దాన్ని తీసుకుని సుప్రీంకోర్టుకు వెళ్తున్నాం. సుప్రీంకోర్టులో ఫైల్ చేశాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

ఎట్టి పరిస్థితుల్లో కూడా మన పిల్లల తలరాతలు మారాలి అంటే, మంచి చదువులు చదవాలని, ఇంగ్లిష్ మీడియమ్ చదువులతో మన బేస్ ఇయర్ మొదలు కావాలని సీఎం స్పష్టం చేశారు.

మొదట ఒకటి నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియమ్ అమలు చేస్తామని, ఆ తర్వాత సంవత్సరం 7వ తరగతి, ఆ తర్వాత 8వ తరగతి, ఆ తర్వాత 9వ తరగతి, ఆ తర్వాత సంవత్సరం 10వ తరగతిలో ఇంగ్లిష్ మీడియమ్ ప్రవేశపెడతామని, ఆ విధంగా నాలుగేళ్లలో మన పిల్లలు, ఇంగ్లిష్ మీడియమ్‌లో సీబీఎస్ఈ పరీక్షలు రాస్తారని తెలిపారు.

## సమస్యలు అధిగమిస్తాం:

ఇంగ్లిష్ మీడియం తీసుకువచ్చినప్పుడు కొన్ని కొన్ని సమస్యలు ఉంటాయన్న సీఎం, పిల్లలు బోర్డు పరీక్ష రాయడానికి 4 ఏళ్ల సమయం ఉందని గుర్తు చేశారు. మరోవైపు ఇప్పటికే టీచర్లకు శిక్షణ మొదలు పెట్టామని, వారు కూడా బాగా సిద్ధమవుతున్నారని, పిల్లలకు కూడా బ్రిడ్జి కోర్సులు మొదలయ్యాయని, వారూ ఇంగ్లిష్ మీడియమ్‌లో చదవడానికి తయారవుతున్నారని చెప్పారు. ఆ విధంగా రాబోయే రోజుల్లో నేచురల్‌గా ఇంగ్లిష్ మీడియమ్‌లోకి మారబోతున్నామని సీఎం అన్నారు.

## ఒక్కసారి ఆలోచన చేయండి:

‘ఒక్కసారి ఆలోచన చేయమని కోరుతున్నా. మన దగ్గర పని చేసే డ్రైవర్ మన దగ్గరకు వచ్చి ఇంగ్లిష్‌లో కనుక మాట్లాడితే, ఆ డ్రైవర్‌కు మనం ఇచ్చే గౌరవం ఏ మాదిరిగా ఉంటుందని ఒక్కసారి ఆలోచన చేయమని అడుగుతా ఉన్నా. గౌరవమైన స్థానానికి పేదవాడు పోవాలి. మన పిల్లలు పోవాలి. అప్పుడే భావితరంతో పోటీ పడే పరిస్థితి వస్తుంది’ అని సీఎం శ్రీ వైయస్ జగన్ వివరించారు.